# ప్రేమపిలుపు

డెక్టర్ లంకపల్లె

తుంది. ఆ ప్రాంతంలో అతను అనుకొంటే కాని పని లేదని, కాదనుకొంటే చీమ కూడ కదలదని అంటారు జనం. అర్థంకాని అతని సంతకం మాయా మంత్రం.

పోస్టుమాన్ వచ్చాడు, చేతిలో కవరుతో. అతనికి జనంలో దూరి రావడం పద్మ వ్యూహంలో ప్రవేశించినట్లే ఉంది. విజయ్ తలపైకెత్తి చూశాడు. అతని తీక్షణమైన చూపును గమనించిన జనం త్రొక్కిసలాట -

పై కెగసిన కెరటం ఆగిపోయినట్లు ఆగింది! విజయ్ మెల్లగా నవ్వాడు. జనం ఊపిరి పీల్చుకొన్నారు.

విజయ్ రిజిష్టరు పోస్టు అందుకొన్నాడు. పెద్దకవరు. అటు ఇటు తిప్పి చూశాడు. ఉత్తరం రాసిన ప్రేమ పేరు చూసిమందహాసం చేశాడు. అడ్రసు చూసి ముఖం చిట్లించాడు. విజయ్ వాలు కుర్చీలో వెనక్కు వాలాడు. అంతటితో ఆరోజు కొలువుకు మంగళం. అంతవరకు విజయ్ సహాయం పొందిన వారు సంతోషంగా వెళ్లారు. అవకాశం చిక్కని వారు మనస్సు చిక్కబట్టుకొని తమ దురదృష్టాన్ని తిట్టుకొంటూ వెళ్లారు. అంత వరకు చెరొక వైపు నిలుచున్న కరటక దమనకులు కూచున్నారు.

విజయ్ కవరు తనే చింపాడు. విజయ్ చాలా రోజులుగా - నెలలుగా ఎదురు చూసిన ఉత్తరం. పేపరుకు ఒక వైపున మాత్రమే రాత. అక్షరాలు ముత్యాల్లా ఉన్నాయి. విజయ్ ఎంతో సంతోషంగా ఉత్తరం చదవటం మొదలు పెట్టాడు. అది ప్రేమ జాబు - ఆమె పేరు ప్రేమ. ప్రేమ ఎదుట ఉన్నట్లే అనుభూతి కలిగింది విజయ్‌లో. కాని ఉత్తరం చదువు తూంటే అతని ముఖంలో రంగులు మారాయి. నిజానికి, సామాన్యులకు అర్థంకాని మోడరన్ ఆర్టు రంగుల చిత్రంలా మారింది అతని వదనం! కరటక దమనకులు వింత ప్రేక్షకులు.

***

ప్రియమైన విజయ్!

ఇప్పుడు నేనుండేది విజయపురి. అందమైన పేరు! పేరుకంటే అందమైన ప్రదేశం. ప్రశాంతికి నిలయం. చల్లని చోటు. విజయపురి మనసారా నేను కోరుకొన్న ప్రదేశం. కలలు కన్న వాతావరణం. ఇంతవరకు కలలు నిజమవుతాయంటే నమ్మేదాన్ని కాను. నా కల నిజమయింది. విజయపురి నాకల కంటే అందమయింది. పవిత్రమయింది. వాస్తవాలు కలలకంటే విచిత్రంగా ఉంటాయి. నువ్వు నమ్మకపోవచ్చు. వారం రోజులుగా అక్షరాల నిజమైన అనుభవం - అనుభూతి.

బావా! ఏమిటి పిచ్చిప్రేమ? పిచ్చిరాతలు అనుకొంటున్నావా? అనుకొన్నా పరవాలేదు. అందుకే అన్నారు - ప్రేమ పిచ్చిదని. ఇక అసలు విషయం. అనుకోని అదృష్టం కలసి వచ్చింది. ఇక్కడ రెసిడెన్షియల్ కాలేజిలో లెక్చరరు ఉద్యోగంలో చేరాను. ఆర్డరు అందుకొన్న రోజు నా ఆనందానికి అవధులు లేవు. ఉత్సాహం కట్టలు తెంచుకొన్నది. నా మనసుకు రెక్కలొచ్చాయి. ఇక్కడ చేరిపోయాను. ఇక్కడ ఏ ఇబ్బందులు లేవు. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. నా ఆశయానికి అందమైన రంగులు పులిమినట్లనిపించింది. వారం రోజులు ఎంత ఆనందంగా గడిచాయో మాటల్లో చెప్పలేను. విజయపురి నుండి మొదటి ఉత్తరం నీకే రాస్తున్నా. ఉత్తరం పెద్దదే కావచ్చు. తీరిక దొరుకుతుందను కొంటాను! చదివే ఓపిక కుదురుతుందను కొంటాను! నా ఉత్తరం కోసం ఎదురు చూడ్డం లేదూ?!

విజయ్! చాలా రోజులుగా నా మనస్సు విప్పి నీతో చెప్పుకోవాలను కొన్నాను. ధైర్యం లేక పోయింది. కాదు, నాకు నేనే ఇదమిత్థమని నిర్ణయించుకోలేని స్థితి అది. నా ఆలోచనలకు ఒక రూపం అంటూ లేని కాలం. నాలో నేనే మథనపడిన సమయం. ప్రశ్నలు, ఎదురుప్రశ్నలు - సమాధానాలు - అసంపూర్ణ జవాబులు. వీటి ఆటుపోటులతో హృదయం అల్లకల్లోలితమైన రోజులు. ఏమిటి అర్థంలేని మాటలు? అని నవ్వుకొంటున్నావా? నాలో ఈ సంఘర్షణ ఎందుకు జరిగిందని ఆలోచిస్తున్నావా? నిండు కుండలా ప్రశాంతంగా కనిపించే నాలో ఇన్ని ఆలోచనలు ఎలా చోటుచేసుకొన్నాయని ఆశ్చర్యపడుతున్నావా? విజయ్ ఒక్క క్షణం ఆలోచించు. ఆకాశం శూన్యం. ఆ శూన్యంలో మబ్బులెలా నిలుస్తాయి? ఘర్షణ ఎందుకు? వాన జీవధారగా ప్రకృతిని ఎలా పులకరింప చేస్తుంది? అలాగే నా ఆలోచనలు. వాటి సంఘర్షణ చివరికి ఈ అక్షర రూపం. చాతక పక్షికి వాన చినుకులలో ఏమి తీపి దొరుకుతుంది? నీ భావనలో అంతకంటే తీపి ఉంది! అరుణోదయ కాంతిలో నీ రూపం చూశాను. మేఘ ఘర్జనలో నీ మాటలు విన్నాను. నీవు ఎంత దూరమైనా, ఏపుగ పెరిగి - బలిష్టంగా కండలు పెంచినా, కోర మీసం గుబురుగా ఉన్నా - నీ రూపం నాపిడికెడు గుండెలో పదిలం - నిన్న మొన్నటి వరకు అది ఎంతో అందమైన బొమ్మ పున్నమి చందమామ!

చదువు పూర్తి చేసిన వెంటనే ప్రజాసేవ చేయాలనే నీ ఉత్సాహాన్ని బలపరిచాను. గ్రామీణ ప్రాంతాన్ని జాగృతం చేయాలనే నీ ప్రయత్నాన్ని అభినందించాను. పేదల బ్రతుకులు బాగు చేయాలనే నీ తపనను అర్థం చేసుకొన్నాను. ఆనందించాను. వీర సైనికుడులా ప్రజాసేవకు శ్రీకారం చుట్టి నందుకు ఎంతో గర్వించాను. కాని .... కాని... ఎక్కడో నాలో దాగిన సందేహం నన్ను హెచ్చరిస్తూనే ఉండేది. నీవు నాకు దూరమవుతావేమోననే భయం! ... నాకు తెలుసు, నీది నిర్మలమైన మనసు. నీ ఎదలో నాకు తప్ప మరొకరికి తావుండదని నమ్మాను. అందుకే నా సందేహం నన్ను హెచ్చరించి నపుడు చివాట్లు పెట్టి అణచి వేశాను.కాని ఏం జరిగింది? -

ఎవరూ ఊహించని విధంగా నీ జీవితం మలుపు తిరిగింది. మొదట నీ చదువు, తెలివి, ధైర్యం, చొరవ, సమయస్ఫూర్తి నీకు అంగరక్షకులై నిన్ను నడిపించాయి. అస్తి, అధికారం అండగా చిన్న వయస్సులోనే ప్రజాసేవలో పేరుగడించావు. రాజకీయ రంగంలో ఉన్నతమైన స్థానం సంపాదించావు. ఎంతో ఎత్తుకు ఎదిగిపోయావు! ఒక్కొక్క విజయం నిన్ను వరించి నపుడు నిన్ను మనసారా అభినందించాను. నిన్ను నేను

అభినందించుకొని గర్వపడిన మాట నిజం

సంపద, హోదా, పరువు ప్రతిష్ట-అవి మీ తాత తండ్రుల ఆర్జితం. చదువు, సేవాభావం, నాయకత్వం నీవార్జించిన పెన్నిధి. ప్రేమించిన పురుషునిలో అంతకంటే స్త్రీ కోరుకొనేదేముంది?...కాని , ఏదో వెలితి కన్పడతూ ఉంది. అంతు తెలియని అగాధం ఏర్పడి పోయిందనే భయం పెను తుఫానులా నన్ను ముంచేస్తూ ఉంది.

మన చిన్ననాటి చెలిమి, చిలిపి చేష్టలు నన్ను చక్కలిగింతలు పెట్టేవి. మనతో పెరిగిన ప్రేమ వీడని బంధమయింది. ప్రేమాను బంధం తెంచుకోలేక నీప్రేమకు బందీ అయ్యాను. ఒక మారు అన్నావు గుర్తుందా? - నామాటలు చిలుకపలుకులని! అవును నీ బంగారు పంజరంలో బంధీ అయిన ప్రేమ పక్షిని! అందుకే ఇంత వివరంగా, ఇంత పెద్ద ఉత్తరం రాయవలసి వచ్చింది.

మన పెళ్లి లగ్నం కోసం అత్తయ్య, మావయ్య వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. అవునా? మా అమ్మ నాన్నలకు మిగిలిన కమలవందుగ మన పెళ్ళి. నీవు నా ప్రేమానురాగాల బంధీవి. కాదనగలవా? మంగళసూత్రం లేని మెడ బోసిగా ఉంది. వంటరి జీవితం బోర్‌గా ఉంది. నీలో కలసి పోవాలనే కోరిక కొండంతలై పెరిగిపోతూ ఉంది.

కాని విజయ్! నా మనసెందుకో కీడు శంకిస్తూ ఉంది. నన్ను అర్థం చేసుకోగలవా? నే కోరుకొనే విధంగా నన్ను నడిపించగలవా? ప్రేమకు సరియైన అర్థం చెప్పగలవా? నా అభ్యర్థన మన్నించి నాతో రాగలవా? ప్రేమ జ్యోతిని చూపించగలను ప్రేమ జ్యోతి వెలుగును చూసి భయంతో రావేమోననే భయంనాలో రోజురోజుకు పెరుకుపోయింది. నిద్ర దూరమయింది-. నా భావాలను నీకు అర్థం అయ్యేలా ఎలా చెప్పటమో తెలియటం లేదు. ఇప్పుడు పండు వెన్నెల. ప్రకృతి నీరవ సంగీతంలో నిదురించింది. సాగరంలో అలలు వెండి కలువ రేకులై ఎగసి ఎగసి జారుతున్నాయి. నా ఆశలు కూడ ఎగసి ఎగసి నీ నిరాదరణతో నిదురపోతాయనే సంశయం ముసురుకున్నది. గుక్క తిరగటం లేదు. విజయ్ అలా జరుగ కూడదు. జరుగదు కదూ? ఇది అందమైన ప్రదేశం. నింగి నేల కలయకను కళ్లార చూడవచ్చు. ఆ మబ్బులలో ప్రేమ పక్షులై ఆడుకోవచ్చు. వెన్నెల తోటలో హాయిగా నిదురించవచ్చు. ఇది ఎంత అందమైన అనుభూతి. ఈ మధుర మైన




ఊహ అనుభవంగా మారితే ఎంత అందంగా ఉంటుంది: అందమే ఆనందం. ఆనందోబ్రహ్మం!

విజయ్! గుర్తుందా? ఐదు సంవత్సరాల క్రితం సంక్రాంతి సెలవుల్లో మన ఊరి చెరువుగట్టున మనం చూచిన దృశ్యం- నిండు చెరువులో ఒకదాని వెంట ఒకటిత రుముకొచ్చే అలలు- అలల మధ్య చిక్కుపడి మెరిసే వెన్నెల. వెన్నెల తెల్లదనం- అలలు- అవి వినిపించే వింత సంగీతం! మృధు మధురంగా నీ మనసు పాడిన గీతం! నన్ను పరవశింప చేసిన భావం...అప్పుడే మన పెళ్ళి జరిగి ఉంటే ఎంత బాగుండేది!' మించి పోయింది లేదు. ప్రేమానుభవం కోసం వేచి ఉండటం ఒక వరశాపం. అది ఎంతటి తియ్యటి బాధ.!

నన్ను పి.జి. చదవమని ఆజ్ఞాపించావు. అంతవరకూ పెళ్లి మాటెత్తితే చెవి మెలివేస్తానన్నావు. శిరసా వహించాను. పి.జి. పూర్తి చేశాను. ఆ రెండేళ్లలో నీలో కొంత మార్పు వచ్చింది. ప్రజాసేవకు తగిన పదవి లభించింది. కాదు పదవిని నీవే నేర్పుతో చేజిక్కించుకొన్నావు. పదవీ నిర్వహణ ఒక గురుతర బాధ్యత! బాధ్యత బరువైనది. చాకచక్యంతో, తెలివి తేటలతో, ఎత్తుగడలతో మరో మెట్టు పైకెళ్ళావు. జనం నీ అదృష్టం మూడు పువ్వులు ఆరు కాయలన్నారు. పొగడ్తల అందలం మీద ఊరేగావు. అప్పుడు నాకేమనిపించిందో చెప్పనా? నీవు దారి తప్పుతున్నావని! కాని నీతో చెప్పే అవకాశం దొరకలేదు. అంతకంటే ధైర్యం చాలలేదు. నిజం చెప్పాలంటే నాకా అవకాశం నీవే ఇవ్వలేదు. నాతో తీరిగ్గా మాట్లాడే వ్యవధి లేదు నీకు. అవునా? మరో మార్గం తోచచక 'రీసర్చి' లో చేరాను. నన్ను అభినందించావు. నాకు కోపం వచ్చింది. నీ ఎధమీద వాలి కసిదీరా తిట్టాలని పించింది; ఏడవాలని పించింది. కాని సాహసించి చొరవ తీసుకొని నీతో మాట్లాడలేకోపోయాను. నా జీవితం మలుపు తిరిగింది. రిసర్చి కాలాన్ని మింగేసింది. పదవీ వ్యామోహం నీకళ్లకు గంతలు కట్టింది. మన జీవితాల మధ్య మరింత అగాధం ఏర్పడింది. పెరిగే అగాధం తలచుకొంటే గుండెజల్లుమనేది. హృదయం కలత పడేది. కాని నా బావ నన్ను వదలడనే ఆశ ఎప్పుడూ ఉంది. పట్టుదలతో మూడేళ్ళలో రిసర్చి పూర్తి చేశాను. ఏం చేయాలో తోచని అయోమయంలో మునిగి తేలుతున్నపుడు- ఈ ఉద్యోగం వచ్చింది. ఆడపోయిన తీర్థం ఎదురయ్యింది.

విజయ్! విజయపురికి వచ్చిన తరువాత నాలోని సంఘర్షణ అర్థమయింది. నేనేమిటో- నాకు కావలసిందేమిటో స్పష్టమయింది. నా నిర్ణయాలకు తుదిరూపం వచ్చింది. ఇది ఒకనాటి మహోన్నత చరిత్రను చాటిచెప్పే ప్రదేశం. శిలలే శిల్పాలయి నిలచాయి. శిల్పాలలో జీవకళ ఉంది. హింసకు పేరు కౄరమృగాలు. కౄరమృగాలు నివసించే అడవిలో అహింసా మందిరాలు వెలిశాయి. కొండల మధ్య సాగరం వెలిసింది! ఇవి నిజమైన ప్రగతికి ప్రతీకలు. విచిత్ర కళారూపాలు చూచినపుడు నా భావాలకు ఒక రూపం వచ్చింది. నేటి పవిత్ర దేవాలయంగా ప్రసిద్ధి చెందిన ఈ డ్యాము - సాగరం నాలో కొండంత ధైర్యాన్ని నింపాయి

అందుకే నా భావాలను నిర్భయంగా రాస్తున్నాను. నువ్వు నన్నేమనుకొన్నా పరవాలేదు. నేనేమిటో నాకు తెలుసు. నిన్ను బాధ పెట్టటం నా ఉద్దేశం కాదు. నామనను నీకు తెలుసు. నామనులోని మాట నీతోకాక మరెవరితో చెప్పుకోను? ఒక వేళ నా మాటలు నీకు బాధ కలిగిస్తే నన్ను క్షమించు.

నీ లోపాలు నేను వేలెత్తి చూపితే కోపం రాదుకదూ? మంచిని ప్రేమించే హృదయమే చెడును ద్వేషించగలదు. ఆరాధించే




హృదయానికే ప్రేమికులలోని అపస్వరాల రాగాలు విన్పడగలవు. నిజమైన నీ ఉన్నతిని కోరుకొనే నా హృదయానికే నీ నిజస్వరూపం ఏమిటో అర్థమయింది. నేటి వాస్తవ స్వరూపాన్ని ఎవరు గుర్తు చేయగలరు. నీ చుట్టూ ఉండే నీ పరివారం నిన్ను ఎటువైపుకు నడుపుతున్నదో నీకు తెలియదు. నీ కరటక దమనకుల సలహాలు నిన్ను ఏ కారుచీకటికి నడిపిస్తున్నాయో చూడలేవు. అందుకే నేను సాహసం చేస్తున్నాను. ఆ మధ్య నీవన్న మాటలు మరచి పోలేకున్నాను. అది - "వజ్రాన్ని వజ్రంతో కోయాలని! ఎత్తుకు పై ఎత్తు రాజకీయమని! కాని ఒక విషయం మరచిపోయావు. నీ లక్ష్యం ఎంత ఆదర్శవంతమైనా అనుసరించే మార్గం వక్రం అయినపుడు మంచిని సాధించలేవు! సాధించినా అది వికృతమే అవుతుంది. అభ్యుదయానికి అడ్డుగోడే అవుతుంది.

నెలరోజుల క్రితం వార్తా పత్రికలో చదివాను..గ్రామంలో ......గాఢ నిద్రలో ఉన్న కుటుంబం...పెద్దలు, స్త్రీలు, పురుషులు, పిల్లలు... సకుటుంబంగా హత్య!.... ఈ వార్త నన్ను దిగ్భ్రాంతిలో ముంచింది. నాగుండెలోని నీ రూపం అమావాస్య చంద్రుడిలా వెలవెల పోయింది. ఆ హత్యలకు కారణం ఏమిటి? హత్య ఎవరు చేశారు? ఆ హత్యల వెనుక అదృశ్య హస్తం ఎవరిది?.... ఏ కర్రన నిప్పంటే ఆ కర్రే కాలుతుంది. పగ మనుషులను వేరు చేస్తుంది. ప్రేమ కలుపుతుంది. హింస క్రూరమృగ ప్రేరణ అహింస మానవతను మేలుకొల్పుతుంది. నీవు నడచే బాట ఎలా, ఎటు వైపుకు?

విజయ్! నెమలి కంటినీరు వేటగాని గుండెను కరిగించదు కాని వేటగాడికి సైతం ఒక ధర్మం ఉందంటారు. నిదురించే పులిని కూడ నిద్రలేపి తప్పించుకొనే అవకాశం కల్పించి తుపాకి గురి పెట్టడం. కాని మన గ్రామంలో జరిగిందేమిటి? నిదురించే స్త్రీలు పురుషులు, పెద్దలు, పిల్లలు దారుణ హత్య! ఋణశేషం, శతృశేషం మిగలకూడదు. శతృశేషం మిగలకూడదని నిండుగా పాలు త్రాగి నిదురలో పసిడి కలలుగనే పసిపిల్లల హత్య! పసిపిల్లలు దేవుని రూపాలు! ఈ హత్య చేసిందెవరు? దానికి కారకులెవరు? హత్యలు ఎవరైనా చేసి ఉండవచ్చు. కాని ఆ హత్యల వెనుక అదృశ్య హస్తం ఎవరిది? నీది! కాదనగలవా? హత్యలకు కారణం నీ పదవీ వ్యామోహం. వ్యామోహంలో మనిషి మరుగుజ్జు అవుతాడు. నీ ఆదర్శం రక్తసిక్తమయింది. అందమైన నీరూపం వికృతంగా మారిపోయింది. నీ నిజస్వరూపాన్ని చూడగలవా? క్షణం రెండుకళ్లు తెరచి చూడు! నీలాగే ప్రతి యువ నాయకుడు తయారైతే ఈ సమాజం ఏమవుతుంది? క్షణం ఆలోచించు.

ఆలోచనలో కుట్ర, పెదవులపై మందహాసం! మనసులో పొంగే కాలకూట విషం, మాటలలో మకరందం! ఈ భిన్న ధృవాల కలయిక మధ్య మనిషిలో మనిషి ఏమవుతాడు? మానవతను కోల్పోతాడు. మానవ సేవ మాధవ సేవ. సేవా కార్యక్రమం సక్రమ మార్గంలో సాగినపుడే సార్థకం. రత్నాన్ని బంగారంలో పొదిగితేనే రాణిస్తుంది. ఏకాంతంలో నీ ఆత్మపైన పేరుకొన్న దుమ్ము దులిపి నీ రూపం చూచుకో- అప్పుడు నీ రూపం ఏమిటో, నీవేమిటో స్పష్టంగా తెలుస్తుంది. అందుకే నిర్మల ప్రవంతిని రక్తపు మరకలు కలుషితం చేయటం నేను చూడలేను. సమాజ ప్రగతికి పునాది హృదయ పరివర్తన. బల ప్రయోగం కాదు. మరోమాట, ఆశకు అంతులేదు. నిద్ర సుఖం కోరదు- ఆశల పుట్టలా తయారైన నువ్వు అన్ని సుఖాల మధ్య ఉంటూకూడా - నిద్రపోగలుగుతున్నావా? నీ గ్రామంలో నువ్వు నిర్భయంగా మిట్టమధ్యాహ్నం నడవగలవా?! సాధించిన ప్రగతి ఏమిటో చూడగలవా?!

విజయ్! ప్రేమకు వెలలేని విలువనిచ్చి పట్టాభిషేకం కట్టిన రాజకుమారుల కథలు చదివాము. ప్రేమకై రాజ్యాలు త్యాగం చేసిన వారి చరిత్రలు ఉన్నాయి. ప్రేమకోసమే జీవించిన చిరంజీవులెందరో! ప్రేమ పేరుతో నేను నిన్ను పిలుస్తున్నాను. నా కోసం నువ్వు నన్ను చేరుకో గలవా? అలా చేస్తావని పూర్తిగా నమ్మకం కుదరటం లేదు. పిచ్చి ప్రేమకోసం ఉన్నత పదవిని త్యాగం చేయగల ధైర్యం ఎంత మందికి ఉంది. నిన్ను వదల లేను. నీ ముళ్ల బాటలో నడువలేను. ఏం చేయాలి? నేను శిథిల శిల్పాన్ని కాలేను! కాను. అర్థమయిందా?

హింసాపూరిత వాతావరణం నుండి బయట పడగలవా? ఇప్పుడు నిన్ను అంటిపెట్టుకొన్న అంగరక్షకులు, కక్ష, కార్పణ్యం పగ, హింస - వీటినుండి బయట పడగలవా? స్వార్థపూరితమైన నీ కోటదాటి అంతుతెలియని అగడ్తలు దాటి రాగలవా? కంటికి రెప్ప, కాలికి చెప్పు, -కాని కనురెప్పలే కనుపాపను కాటేసే కాలం! ఇది అర్థం చేసుకోగలవా?

ఈ విజయపురి ఒకప్పుడు ప్రశాంత ఆరామం - బౌద్ధారామం. కక్షలు, కార్పణ్యాలు, మూఢ విశ్వాసాలకు దూరంగా వెళ్లి మంచిని, మానవతను పెంచాలని ప్రయత్నించిన బుద్ధ జీవుల నిలయం. సింహాసనాన్ని, సంసారాన్ని వదలి సత్యాన్వేషణలో బుద్ధుడు సాధించిన జీవకారుణ్య ప్రబోధానికి ప్రతీక. అందుకే ఈ ప్రదేశం నన్నెంతో ఆకర్షించింది. ఆత్మానుభూతికి దోహదం చేసింది. స్థిరత్వం లేని నా ఆలోచనలకు కొత్త రూపం వచ్చింది. ప్రేమ స్వరూపం కన్నులకు కట్టినట్లుంది. ప్రేమ సాగరంలో ప్రతి అణువు తడిసినట్లుంది. ప్రేమ తడి ఆరని గుండె పిలుపు వినిపించుకో! ప్రేమ విపంచి రాగాలాపన ఆలకించు! జీవితానికి ఏది సరైన మార్గం? పగను రగిల్చే 'మెకియ వెల్లి' మార్గమా? ప్రేమ మార్గమా? ఎంత తొందరగా నిర్ణయించుకొంటే అంత మంచిది.

నీ ఉన్నత పదవి పదిలంకాదు. నీ ఉన్నది హింసాగ్ని పర్వతం మీద. అది ఎప్పుడైనా బ్రద్దలు కావచ్చు. అగ్నికి విరుగుడు నీరు. హింసకు విరుగుడు అహింస, విశ్రాంతి, ప్రశాంతి లేని జీవితం ఎందుకు? హింస గాలి దూరని, పగసెగ సూపని, కక్షల నీడ పడని ఈ అహింసా సాగరం గట్టున ప్రశాంత జీవితం

గదుపుదాం. మనకోసం, ప్రేమకోసం నన్ను చేరుకో.

విజయ్! ఉత్తరం రాస్తావు కదూ? నీ. రాకకై అణువణువు కళ్ళై ఎదురు చూసే - నీప్రేమ.




★★★

విజయ్ ఉత్తరం చదవటం ముగించాడు. ఉత్తరం చదువుతున్నంత సేపు అతని ముఖంలో నవరసాలు నాట్యం చేశాయి. కరటకదమనకులు వెళ్లిపోయారు.

ప్రేమ సిద్ధాంతం బలమైనది. అమె తర్కం పదునైనది. విజయ్ మెల్లగా లేచి అల్మారాలో అల్బం అందుకొన్నాడు. చిన్నప్పటినుంచి తీసుకొన్న ప్రేమఫొటోలు పదిలంగా ఉన్న అల్బం అది. అల్బం చివరి ఖాళీ పేజీలలో ప్రేమ ఉత్తరం పేజీలు అతికించాడు నిట్టూర్చాడు. కళ్లు చెమ్మగిల్లాయి. విజయ్ అల్బమ్ మూసి అల్మారాలో పెట్టాడు. ప్రేమకు జవాబు ఏమని, ఎలా రాయాలి? తెలియదు! అంతరాంతరాలలో చెలరేగిన పెనుతుఫాను దెబ్బకు చలించాడు. నిలదొక్కుకున్నాడు. గుండెలో ప్రేమజ్వాలను ఎదమీద చేయి వేసి అర్పేశాడు. మొదటిసారిగా జీవితంలో తను ఏకాకినన్న భయం - బాధ అతన్నావరించింది. అప్రయత్నంగా వాలు కుర్చీలో వాలి కళ్లు మూసుకొన్నాడు. అంతే రాతిగుండెనేటి రాజకీయానికి పునాది. అతనిలో చెలరేగిన పెనుతుఫాను పెదవులపై పేలవమైన నవ్వుగా మారి బయట పడింది. మనిషిలోని మనోగత భావాలకు ప్రతిబింబం నవ్వు. నవ్వు నవరాగాలను పలికించగలదు. అతని పేలవమైన నవ్వు ప్రేమకు జవాబు-.

'నల్ల బండలో కూడ నీటిపొర ఉంటుంది. ఎప్పటికైనా కరకురాతి గుండె ప్రేమ జ్వాలకు కరగదా? ప్రేమ జ్యోతియై వెలగదా?"- ఇది నాగార్జున సాగర్ గట్టున చల్లని వెన్నెల్లో కూచున్న ప్రేమ ఆలోచన. ప్రేమవిశ్వాసం. ●

